క్లుప్తంగా

మెగా వైద్య శిబిరానికి స్పందన


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

చంద్రగిరి: స్థానిక బ్లూమింగ్ బడ్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చినట్లు పాఠశాల చైర్మన్ హితేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. తిరుపతిలోని మారుతి హాస్పిటల్ సౌజన్యంతో సుమారు రూ.3వేల విలువైన ఈసీజీ, ఎకో, షుగర్, బీపీ, బీఎంఐ, పల్మనరీ ఫంక్షన్ తదితర పరీక్షలను చేసినట్లు వెల్లడించారు. ప్రముఖ వైద్యులు చంద్రశేఖర్ రెడ్డి, నరసింహా, రమణ, సాయిరామ్, జాన్ చౌదరి నేతృత్వంలో సుమారు 250 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం ఆసుపత్రి వైద్యులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

పరామర్శ


నాగులు కుటుంబాన్ని పరామర్శిస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

చంద్రగిరి: మండల పరిధిలోని కల్‌రోడ్డుపల్లి పంచాయతీ భాగ్యనగరం హరిజనవాడకు చెందిన నందిపాటి నాగులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డి ఆదివారం గ్రామానికి చేరుకుని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు.

అండగా ఉంటాం

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం చిట్టెచెర్లకు చెందిన యుహితకుమారి రెండు రోజుల క్రితం మృతి చెందింది. తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అనంతరం దేవరకొండ పంచాయతీలో దూది విశ్వనాథం మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన వెంట ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, సర్పంచ్ విజయ్‌కుమార్, నాగచెంగమనాయుడు, కొండారెడ్డి, గురుశంకర్, ఉమామహేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

తిరుపతి రూరల్: ముత్యాలరెడ్డిపల్లి ఉన్నత పాఠశాల 2002–2003 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత ఆదివారం పాఠశాలలో కలిశారు. కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా గడిపారు. పాఠశాలలో నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాడు తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు పద్మావతి, వాగ్దేవి, సూర్యప్రకాష్‌రెడ్డి, సుబ్రమణ్యం నాయుడు, బాలాజీ, ప్రకాష్‌లను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాము, ఇంద్రసేన, చంద్రమౌళి, వెంకటేష్, బాలు, లత, ఉమా, జ్ఞానంబిక, జమున, హిమావతి, రూప పాల్గొన్నారు.

స్వర్ణమ్మ మహా హారతుల పనులు పరిశీలన

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో ఈనెల 12న నిర్వహించే స్వర్ణముఖి నది హారతి ఉత్సవ పనులను ఆదివారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనలతో ఈనెల 12న స్వర్ణముఖి నది తీరాన మహా హారతి ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 40–50 అడుగుల ఎత్తులో ఐదు నదీ హారతులు ఇచ్చేందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు ఆయన వరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. మందకొడిగా సాగుతున్న పనులను వేగవంతం చేయాలని సూచించారు.

భవహరణా..శుభచరణా



శ్రీకాళహస్తి: ఓం నమఃశ్శివాయ నామస్మరణతో శ్రీకాళహస్తీశ్వరాలయం ప్రతిధ్వనించింది. శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ఆకాదీపాన్ని శాస్త్రోక్తంగా వెలిగించారు. ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రతిరోజూ ఆకాశదీపాన్ని సంప్రదాయబద్ధంగా వెలిగిస్తున్నారు. ఆదివారం రాత్రి ఆలయంలోని ఊంజల్‌సేవ మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్తూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు ఓం నమశ్శివాయ అంటూ ఆకాశదీపాన్ని దర్శించుకున్నారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణతో సమాజ శ్రేయస్సు

- జ్యుడీషియల్ జడ్జి పసుపులేటి శంకర్


మాట్లాడుతున్న రాజంపేట జ్యుడిషియల్ జడ్జి పసుపులేటి శంకర్

తిరుపతి కల్చరల్: మానవ హక్కుల పరిరక్షణ సమాజ శ్రేయస్సుకు దోహదమని, ప్రతి ఒక్కరూ మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని రాజంపేట జ్యుడిషియల్ జడ్జి పసుపులేటి శంకర్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా వరల్డ్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ సుధామయి ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి రైల్వే కాలనీలోని సరస్వతీ శిశుమందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా ప్రసంగించారు. రాజ్యాంగం ద్వారా మానవ హక్కులను కల్పించి హ్యూమన్ రైట్స్ కమిషన్ ఏర్పాటు చేసుకున్న దేశం మన భారతదేశమని తెలిపారు. నేడు హక్కుల ద్వారా ప్రశ్నించే స్థాయి పెరిగిందన్నారు. స్త్రీమూర్తులు సైతం దేశ స్వేచ్ఛ సాధనలో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. దేశం, కుటుంబ వ్యవస్థ సుభిక్షతలో మహిళల పాత్ర కీలక మని తెలిపారు. భారతదేశం మనకు అందించిన సంస్కృతి, సనాతన ధర్మాలను కుటుంబంలో పిల్లలకు అందించడంతో పాటు మానవ హక్కులపై వారిని చైతన్యం కలిగించి మంచి పౌరులుగా తీర్చిద్దాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో అసమానతలను విడనాడి సమానత్వం అనే భావన రేకెత్తించడంతో పాటు హక్కుల సాధన పరమావధిగా ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం రుయా డాక్టర్ రోజారమణి, సరస్వతి శిశుమందిర్ అధ్యక్షుడు ప్రొఫెసర్ హేమంత్‌కుమార్, సరస్వతి శిశుమందిరం స్కూల్ కమిటీ ప్రతినిధి కీర్తి వెంకయ్య మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన మానవ హక్కులు, వాటి వినియోగం, ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో వరల్డ్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ నేతలు, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

సీమ సమగ్రాభివృద్ధికి ఉద్యమం


మాట్లాడుతున్న జనచైతన్య వేదిక అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి

తిరుపతి కల్చరల్: రాయలసీమ సమగ్రాభివృద్ధికి ఐక్యంగా ఉద్యమించాలని వివిధ రాజకీయ పార్టీల నేతలు పిలుపు నిచ్చారు. జనచైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో »రాయలసీమ అభివృద్ధి– సమస్యలు«పై చర్చాగోష్టి నిర్వహించారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి రాజ్యసభ మాజీ సభ్యుడు ఎన్.తులసిరెడ్డి మాట్లాడారు. విభజన హామీలను కేంద్రం అమలు చేయకపోవడంతో రాయలసీమ తీవ్రంగా నష్టపోయిందన్నారు. సీపీఐ కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సీమ అభివృద్ధికి నడుంబిగించాలని సూచించారు. లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ నీటి పారుదల ప్రాజెక్టులను పట్టించుకోకపోవడం వల్లే సీమ కరువు ప్రాంతంగా మారిందన్నారు. జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ రాయలసీమకు నీరు, నిధులు, నియామకాల్లో న్యాయం జరగాలని కోరారు. సీపీఐ నేత జి.ఓబులేష్ మాట్లాడుతూ సీమ అభివృద్ధికి చేపట్టే చర్యలను అన్ని పార్టీలు తమ ప్రణాళికలో పేర్కొనాలని స్పష్టం చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ నేత నరసింహ యాదవ్, సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, సీపీఐ నేతలు రాధాకృష్ణ, పెంచలయ్య, కాంగ్రెస్ నేత నవీన్‌కుమార్‌రెడ్డి ప్రసంగించారు.

పార్టీ బలోపేతానికి అందరి కృషి అవసరం



మాట్లాడుతున్న వెంకటనారాయణరెడ్డి

భాకరాపేట: జిల్లాలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అందరి సహకారం అవసరమని జేసీఎస్ తిరుపతి జిల్లా కో–ఆర్డినేటర్ వెంకటనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం భాకరాపేట పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. అందరూ సమష్టిగా పనిచేసి మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు.సమావేశంలో జేసీఎస్ మండల కన్వీనర్ ఖదీర్ అహ్మద్, పార్టీ మండల అధ్యక్షుడు కొండారెడ్డి, నాయకులు గురుశంకర్, ఉమామహేశ్వర్‌రెడ్డి, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశక్తిపీఠంలో టీటీడీ ఈఓ ధర్మారెడ్డి


పీఠాధిపతి ఆశీస్సులు తీసుకుంటున్న ధర్మారెడ్డి

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువు సమీపంలో ఉన్న శ్రీశక్తిపీఠంలో టీటీడీ ఈఓ ధర్మారెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పీఠం నిర్వాహకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. పీఠంలో కొలువైన శ్రీవారాహీదేవికి, శ్రీమరకతశక్తి కాళీదేవికి పూజలు నిర్వహించారు. శ్రీశక్తిపీఠం వ్యవస్థాపకులు కుర్తాళం పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీస్వామి, మాతాజీ రమ్యానంద భారతీ ఆశీస్సులు పొందారు. ఆలయ సిబ్బంది శ్రీకాంత్, వేణుగోపాల్, ప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు


తెలంగాణ హైకోర్టు జస్టిస్ ఎన్వీ బద్రీనాథ్


మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ బద్రీనాథ్, మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్, మాజీ ఐఏఎస్ అధికారులు నిమ్మగడ్డ రమేష్ కుమార్, ఎల్వీ సుబ్రహ్మణ్యం, తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

వారపు సంతలో అన్నదానం


అన్నదానం చేస్తున్న ఎంపీటీసీ సభ్యులు

చంద్రగిరి: వారపు సంతలో వ్యాపారాలు చేసుకునే రైతన్నలు, వ్యాపారులకు తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 4 గంటల వరకు సుమారు వెయ్యి మందికిపైగా అన్నదానం చేసినట్లు ఎంపీటీసీ సభ్యులు మాధవరెడ్డి, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి తెలిపారు. సుమారు 5 నెలలుగా ప్రతి ఆదివారం సంతలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దూరప్రాంతాల నుంచి వారు ఆకలితో పస్తులుండకూడదనే ఉద్దేశంతో తమ నాయకుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సంకల్పించారన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఆదివారం రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిద్దిక్ ఖాన్, గిరి పాల్గొన్నారు.


పాకాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1982 బ్యాచ్ పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

అపూర్వ కలయిక


సంస్కృత ఉపాధ్యాయుడికి సన్మానం

పాకాల: ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాము.. చదువులమ్మ చెట్టు నీడలో అంటూ బాల్యంలో పాకాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివి 41 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనంలో ఒక్కటయ్యారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాకాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆదివారం 1977–82 బ్యాచ్‌కు చెందిన 130 మంది విద్యార్థులు కలుసుకున్నారు. తాము చదివిన పాఠశాలను మళ్లీ చూసుకుని ఆనందబాష్పాలు రాల్చారు. మిత్రులను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాటి విద్యాభ్యాసం, ఉపాధ్యాయుల పాఠశాలలో జరిగిన మధురానుభూతులను పంచుకుని ఆనందడోలికల్లో మునిగితేలారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. విద్యార్థి దశ చాలా విలువైందని నేటి కలయికకు హాజరైన ఎంతో మంది విద్యార్థులు వివిధ రంగాలను ఎంచుకుని ఉన్నత స్థానాలకు ఎదగడం అభినందనీయమన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి టీటీడీ పీఆర్వో తలారి రవి ఆధ్వర్యంలో ఆనాటి ఉపాధ్యాయులు అన్నయ్యనాయుడు, మునస్వామి, రఘునాథరెడ్డి, నారాయణరెడ్డి, రంగనాథ్‌నాయుడు, అబ్దుల్‌మునాఫ్, మురళీధర్‌శర్మ, రాఘవాచారి, విక్టోరియాలకు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు బండ పాకాల సుధాకర్, మచ్చా వేణునాయుడు, నారాయణస్వామి, నాగవేణి, కలామ్‌ముల్లా, రవీంద్రబాబు, జ్యోతి వెంకటరత్నం, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

గౌడ వన సమారాధన


మాట్లాడుతున్న వీజీఆర్.నారగోని

తిరుపతి కల్చరల్: నగరంలోని పీఎల్ఆర్ కల్యాణ మండపంలో ఆదివారం గౌడ కార్తీక వన సమారాధన జరిగింది. గౌడ ఉద్యోగుల సంక్షేమ సంఘం, గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యార్లపల్లి గోపినాథ్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం గౌడ కుటుంబీకులందరూ సహపంక్తి భోజనాలు చేశారు. గౌడ ప్రముఖులు మాట్లాడుతూ.. బీసీలు రాజ్యాధికార దిశగా పోరాడినప్పుడే వెనుకబడిన వర్గాల అభివృద్ధి సాధ్యమని తెలిపారు. అనంతరం గౌడ వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. కార్యక్రమంలో ఈడిగ కార్పొరేషన్ చైర్మన్ శాంతికుమార్ దంపతులు, సంఘం నాయకులు వీజీఆర్ నారగోని, డి.కుమారస్వామి, టి.చిరంజీవి గౌడ్, బాబు, ఆనందబాబు, మద్దిలేటి కృష్ణమూర్తి, చింతమని ఆనంద్, మునిశేఖర్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

బంగారు ఆభరణం అప్పగింత


బ్రేస్‌లెట్‌ను బాధితుడికి అప్పగిస్తున్న సూపరింటెండెంట్ వెంకటస్వామి

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి దర్శనానికి వచ్చిన ఓ భక్తుడు ఆదివారం ఆలయంలో పోగొట్టుకున్న బంగారు బ్రేస్‌లెట్‌ను టీటీడీ అధికారులు బాధితునికి అప్పగించారు. వివరాలు.. హైదరాబాద్‌కు చెందిన నాగమిత్ర దీప్ స్వామివారి దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. బయటకు వచ్చిన తర్వాత తన చేతిలోని 12గ్రాముల బంగారు బ్రేస్‌లెట్ కనిపించలేదు. ఈ క్రమంలో ఆలయంలో బంగారు బ్రేస్‌లెట్‌ను విజిలెన్స్ అధికారులు గుర్తించి, సూపరింటెండెం ట్ వెంకటస్వామికి అందజేశారు. ఆయన మైక్ ద్వారా విషయం తెలియజేయడంతో నాగమిత్ర దీప్ ఆలయం వద్దకు చేరుకుని, తగిన గుర్తులు తెలియజేశారు. దీంతో అతనికి బ్రేస్‌లెట్‌ను సూపరింటెండెంట్ అందజేశారు.

ఉప్పరపల్లి ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్

తిరుపతి రూరల్: గాంధీపురం పంచాయతీ పరిధిలోని ఉప్పరపల్లి ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షుడిగా మన్నూరు శివ, అధ్యక్షుడిగా అమర్నాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నామా వరదరాజులు, ఉపాధ్యక్షులుగా వేణుగోపాల్‌రెడ్డి, జానర్దన్‌రెడ్డి, కోశాధికారిగా శివకుమార్, సభ్యులుగా హరికిరణ్, రమేష్, ప్రవీణ్‌కుమార్, నాగరాజు, బాలాజీరెడ్డి, నారాయణను ఎన్నుకున్నారు. చట్టపరిధిలో కొనుగోలు చేసిన ప్లాట్‌లలో ఇళ్ల నిర్మాణం చేయకుండా ఆక్రమణదారులు బెదిరింపులకు పాల్పడడంపై అసోసియేషన్ ఖండించింది. కబ్జాదారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు.

క్రిమినల్ చట్టాల సవరణలను ఉపసంహరించాలి



ర్యాలీలో పాల్గొన్న పౌర చైతన్య వేదిక సభ్యులు

తిరుపతి కల్చరల్: క్రిమినల్ చట్టాలైన ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ యాక్ట్‌ల సవరణలు పూర్తి అప్రజాస్వామికమని, దీన్ని కేంద్రం వెంటనే ఉపసంహరించుకోవాలని పౌర చైతన్య వేదిక నేతలు డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా పౌర చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. బాలాజీ కాలనీ సర్కిల్ నుంచి ఎన్‌టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా వేదిక నాయకులు ప్రతాప్ సింగ్, అజీజ్‌బాషా, షేక్ జబ్బార్ మాట్లాడుతూ ప్రపంచంలో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలు, అణచివేతలను వివరించారు. అమెరికా అండతో ఇజ్రాయిల్ దేశం పాలస్తీనా ప్రజలపై చేస్తున్న యుద్ధ దాడుల్లో మానవ హక్కులు మంట కలుస్తున్నాయని ధ్వజమెత్తారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మానవ హక్కుల అణచివేత యథేచ్ఛగా జరుగుతోందని విమర్శించారు. ఏఐఎంఎస్ఎస్ మహిళా సంఘం ఇన్‌చార్జ్ లక్ష్మీ సింగ్, రామచంద్రయ్య, హరీష్, సుబ్బయ్య, అమీనా, తేజశ్రీ, నవీన్, రాహుల్, వేదిక సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రదోష పూజలు


అలంకరణలో సిద్ధేశ్వరస్వామి

భాకరాపేట: ఎర్రావారిపాళెం మండలం నెరబైలు గ్రామంలోని గుడిమిట్ట సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రదోష పూజలు నిర్వహించారు. సాయంత్రం అన్నాభిషేకం చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్తలు కృష్ణమూర్తి, శివకుమార్ భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

కాంట్రాక్ట్ వర్కర్స్ నూతన కమిటీ

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి సత్రాల్లో పనిచేస్తున్న టీటీడీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నగర నూతన కమిటీని ఎంపిక చేసినట్లు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.రాధాక్రిష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. యూనియన్ గౌరవాధ్యక్షుడిగా ఎన్‌డీ.రవి, గౌరవ సలహాదారుడిగా సీహెచ్.శివకుమార్, అధ్యక్షురాలిగా కె.ద్రాక్షాయని, కార్యదర్శిగా కె.అరుణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డి.సరిత, ఉపాధ్యక్షులుగా ఎ.గంగులమ్మ, గీత, పి.వనజ, ఎం.గీత, సహాయ కార్యదర్శులుగా ఎస్.వెంకటరత్నమ్మ, పి.జ్యోతి, లక్ష్మమ్మ, సరిత, అమ్ములు, కోశాధికారిగా ఎస్.శివమ్మ సహా 15 మంది కమిటీ సభ్యులను నియమించినట్లు పేర్కొన్నారు.